ఐటీ కంపెనీల దాగుడుమూతలు

- సంస్థలు వచ్చేదెన్నడో, ఉద్యోగాలు ఇచ్చేదెన్నడో?
- ఇటీవల టీసీఎస్, కాగ్నిజెంట్‌కు భూముల కేటాయింపు
- గతంలోనూ అనేక కంపెనీలకు భూములు
- అనేక సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించకుండానే దశాబ్దాలుగా కాలక్షేపం

- 8లో

లంకెలపాలెం ప్రమాదంలో

మరో ఇద్దరి మృతి

- చికిత్స పొందుతున్నప్పటికీ విషమించిన ఆరోగ్య పరిస్థితి
- అనకాపల్లి ఆస్పత్రిలో కంటైనర్ డ్రైవర్ అప్పలరాజు, విశాఖ కేజీహెచ్‌లో రామ్‌కుమార్ మృతి
- ఐదుకు చేరిన మరణాలు



రేఖ అప్పలరాజు (ఫైల్ ఫొటో)



సాలాపు రామ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం/ కొత్తూరు/ రావికమతం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. ప్రమాదం జరిగిన రోజున ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన విషయం తెలిసింది. బుధవారం రాత్రి ఒకరు, గురువారం ఉదయం మరొకరు మృతిచెందడంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

ఈ నెల 23వ తేదీ రాత్రి పదిన్నర గంటల సమయంలో విశాఖపట్నం పోర్టు నుంచి తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు పప్పుల బస్తాలతో వెళుతున్న లారీ, లంకెలపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న పలు వాహనాలపైకి దూసుకుపోయిన విషయం తెలిసిందే. కంటైనర్ లారీ, మూడు కార్లు, పలు ద్విచక్రవాహనాలు ధ్వంసం అయ్యాయి. ఈ సంఘటనలో అనకాపల్లి మండలం రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ, అనకాపల్లి గవరపాలేనికి చెందిన కొణతాల అచ్చియ్యయుడు, శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం చెల్లయ్యవలస గ్రామానికి చెందిన వై.ఎర్రప్పడు మృతిచెందారు. మరో 13 మందికి తీవ్రగాయాలు, నలుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారు అనకాపల్లి, విశాఖపట్నంలో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబిల్లి మండలం వెల్చూరు పంచాయతీ విజయరామపురం అగ్రహారం వీధికి కంటైనర్ డ్రైవర్ రేఖ అప్పలరాజు (30) పరిస్థితి ... మిగతా 8వ పేజీలో

గుల్లిపాడు రైల్వేస్టేషన్‌కు మహర్దశ

నక్కపల్లి స్టీల్‌ప్లాంట్ వరకు కొత్తగా రైల్వే ట్రాక్ నిర్మాణం ?



కొత్తగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- ముడి సరకు, ఉక్కు ఉత్పత్తుల రవాణా కోసం..
- రైల్వే ట్రాక్ ఏర్పాటుపై అధ్యయనం
- రైల్వేస్టేషన్ నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం
- ఇప్పటికే అందుబాటులోకి ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- ప్లాట్ ఫారాలపై రేకుల షెడ్ల నిర్మాణం



శిథిలావస్థకు చేరిన గుల్లిపాడు రైల్వేస్టేషన్ భవనం

నక్కపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

మండలంలో పురాతనమైన గుల్లిపాడులో రైల్వేస్టేషన్‌కు రానున్న రోజుల్లో మహర్దశ పట్టనుంది. ఇక్కడి నుంచి ఉక్కు ఎగుమతులతో స్టేషన్ రద్దీగా మారనున్నది. నక్కపల్లి మండలంలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా కంపెనీలు రూ 1.4 లక్షల కోట్ల వ్యయంతో భారీ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చిన సంగతి తెలిసిందే. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్‌లో ఏర్పాటుకానున్న భారీ ఉక్కు ఫ్యాక్టరీ.. రానున్న రోజుల్లో గుల్లిపాడు రైల్వేస్టేషన్‌కు ఒక వరం కాబోతున్నది. ప్రస్తుతం వున్న రైల్వేస్టేషన్ భవనం దాదాపు 90 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో శిథిలావస్థలో వుంది. ఈ నేపథ్యంలో నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న స్టీల్ ప్లాంట్‌కు ముడి ఖనిజాల దిగుమతి, ఉత్పత్తి అయిన ఉక్కును ఎగుమతి చేసేందుకు రైలుమార్గం ఎంతో కీలకం. ఇందుకోసం గుల్లిపాడు రైల్వేస్టేషన్ అన్ని విధాలా అనుకూలంగా వుందని రైల్వే వర్గాలు, కేంద్ర పరిశ్రమల శాఖలు ఇప్పటికే గుర్తించాయి. గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి కొత్తగా నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీ వరకు కొత్తగా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాల్సి వుంటుంది. రైల్వే ట్రాక్‌ను ఏ గ్రామాల పరిధిలో నుంచి వేయాల్సి వుంటుంది, ఎంతమేర భూములను సేకరించాలన్న దానిపై ఒక ఉన్నతస్థాయి బృందం ఇప్పటికే అధ్యయనం చేసింది. రైల్వే ట్రాక్ నిర్మాణం, భూ సేకరణకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేయాల్సి వుంటుంది. ఇందులో కొంత మొత్తాన్ని ప్రైవేటు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, మరికొంత మొత్తాన్ని రైల్వే శాఖ భరిస్తాయని తెలిసింది. గుల్లిపాడు నుంచి స్టీల్ ప్లాంట్‌వరకు రైల్వే ట్రాక్ నిర్మాణం చేపడితే.. అప్పుడు ఈ స్టేషన్‌ను 'గుల్లిపాడు జంక్షన్'గా మార్చాల్సి వుంటుంది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల అవసరాల దృష్ట్యా ఈ స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సదుపాయం కల్పించే అవకాశం వుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



రైల్వే స్టేషన్ నూతన భవన నిర్మాణానికి భూమిని చదును చేస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్ నూతన భవననిర్మాణ పనులకు శ్రీకారం

గుల్లిపాడు స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న భవనం చిన్నది కావడమే గాకుండా శిథిలావస్థకు చేరింది. దీనికితోడు కొత్తగా నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ రైల్వేస్టేషన్‌కు కొత్త భవన నిర్మాణ పనులకు రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం వున్న స్టేషన్‌కు ఆనుకుని, సకల సదుపాయాలతో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. మరో ఏడాదిలో నిర్మాణ పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. ప్రయాణికులు వేచి వుండేందుకు షెడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్

జిల్లాలో 183 ప్రధాన కేంద్రాలుగా మార్పు

- త్వరలో ఆయా కేంద్రాలకు సహాయక పోస్టులు భర్తీ



మాకవరపాలెం మండలం హెచ్.అగ్రహారంలో అప్‌గ్రేడ్ కానున్న మినీ అంగన్‌వాడీ కేంద్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ప్రధాన కేంద్రాలుగా మారనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ప్రస్తుతం వున్న 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలు కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం భావించింది. రెండు రోజుల క్రితం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారనున్నాయి. జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా మారనున్నాయన్న దానిపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జిల్లాలో 1,725 అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండాల్సి ఉండగా 1,692 మంది మాత్రమే వున్నారు. సహాయకులు 1,725 మందికిగాను 1,639 మంది ఉన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్క కార్యకర్త మాత్రమే వున్నారు. ప్రధాన కేంద్రంగా మార్చిన తరువాత అదనంగా సహాయకురాలి పోస్టులను భర్తీ చేయాల్సి వుంటుంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై అంగన్‌వాడీల సిబ్బం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్వారీ నిర్వాహకుల బరితెగింపు

- చెరువులో నుంచి మరోసారి రోడ్డు నిర్మాణం
- పరిశీలించి వెళ్లిన రెవెన్యూ అధికారులు
- చర్యలు చేపట్టడంలో మీనమేషాలు

- 8లో

నషా ముక్త్ భారత్ అభియాన్

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా అంతటా గురువారం 'నషా ముక్త్ భారత్ అభియాన్-2025' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రం అవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. సబ్బవరంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా వుంటామని, రవాణాను అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

సబ్బవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు





రావికమతం మండలం కొమిరలో వరి విత్తనాలు చల్లుతున్న రైతులు

కొనసాగిన ముసురు

- పలు మండలాల్లో తేలికపాటి జల్లులు
- నేడు, రేపు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

అనకాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం కూడా ముసురు వాతావరణం కొనసాగింది. అనకాపల్లి, మాడుగుల, గొలుగొండ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కశింకోట, మునగపాక, ఎలమంచిలి, మాకవరపాలెం, చోడవరం ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలి రాని ఎక్స్‌ప్రెస్ బస్సులు

దూరప్రాంతాల ప్రయాణానికి ఇక్కట్లు

- రైల్వే ఫ్లై ఓవర్ వంతెన అందుబాటులోకి వచ్చినా.. పూర్తిస్థాయిలో బస్సులు నడపని అధికారులు



ఎలమంచిలి ఆర్టీసీ బస్ స్టాండ్

ఎలమంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ఎలమంచిలిలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు పూర్తిస్థాయిలో రాకపోకవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొక్కిరాపల్లి రైల్వే గేటు స్థానంలో ఫ్లై ఓవర్ వంతెన అందుబాటులోకి వచ్చిన తరువాత కూడా దూరప్రాంత సర్వీసులను ఎలమంచిలి మీదుగా నడపకపోవడం శోచనీయమని స్థానికులు అంటున్నారు.

ఎలమంచిలి బస్టాండ్ నుంచి మునిసిపాలిటీతో పాటు చుట్టుపక్కల వున్న ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజల దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు పదేళ్ల క్రితం వరకు హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, టెక్కలి, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు ఎలమంచిలి బస్‌స్టాండ్ మీదుగా రోజూ 30కి పైగా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిచేవి. దీంతో బస్‌స్టాండ్ ప్రయాణికులతో రద్దీగా వుండేది. అయితే కొక్కిరాపల్లి వద్ద రైల్వే గేటు స్థానంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించడంతో ఆర్టీసీ అధికారులు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను హైవే మీదుగా మళ్లించారు. ఎలమంచిలి నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అనుకున్నమేర ప్రయాణికులు ఎక్కడం/ దిగడం లేదని, అంతేకాక రైలు గేటు పడినప్పుడు బస్సులు ఎక్కువసేపు ఆగాల్సి రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ఈ కారణాల వల్ల ఎక్స్‌ప్రెస్ సర్వీసులను హైవే మీదుగా మళ్లించాల్సి వచ్చిందని అప్పట్లో అధికారులు చెప్పుకొచ్చారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఎలమంచిలి ప్రయాణికులు.. అటు అడ్డరోడ్డు లేదా ఇటు అనకాపల్లి వెళ్లి, వేరే బస్సులు ఎక్కాల్సి వస్తున్నది. కాగా కొక్కిరాపల్లి వద్ద రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం గత ఏడాది పూర్తయ్యింది. కానీ ఎక్స్‌ప్రెస్ బస్సులు పూర్తిస్థాయిలో ఎలమంచిలి మీదుగా రాకపోకలు సాగించేలా అధికారులు ఇంతవరకు ఏర్పాట్లు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడడంతో కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎలమంచిలి మీదుగా మళ్లించారు. కానీ మరికొన్ని బస్సులను కూడా ఎలమంచిలి మీదుగా నడపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బడికి వెళ్లాలంటే

10 కి.మీ.లు నడవాల్సిందే

- రోజూ ఇబ్బంది పడుతున్న గిరిజన చిన్నారులు
- ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రుల వినతి



పుస్తకాల బ్యాగులతో నడుచుకుంటూ వై.బి.పట్నం పాఠశాలకు వెళుతున్న గిరిజన చిన్నారులు

రోలుగుంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని అర్ల పంచాయతీ శివారు పెదగరువు, కొత్తలోసింగి, పాతలోసింగి గిరిజన గ్రామాలకు చెందిన పిల్లలకు చదువు భారంగా మారింది. పాఠశాలకు వెళ్లి రావడానికి రోజూ పది కిలోమీటర్లు నడవాల్సి వస్తున్నది. రాకపోకల సమయంలో వర్షం కురిస్తే తడిసిపోయి జ్వరాలబారిన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా గత ఏడాది వరకు మండలంలోని వై.బి.పట్నం పాఠశాల ఉపాధ్యాయుడుని డిప్యూటేషన్‌పై నియమించి లోసింగిలో పాఠాలు బోధించారు. గత ఏడాది ఏప్రిల్‌లో డిప్యూటేషన్ ముగిసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు వారాలు అయ్యింది. డిప్యూటేషన్‌పై ... మిగతా 8వ పేజీలో

వంట గ్యాస్ లీక్‌తో మంటలు

రూ.4 లక్షల నగదు, 4 తులాల బంగారం దగ్ధం

- ఇంటిలో వస్తువులు సైతం కాలి బూడిద..
- రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా



వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో కాలిపోయిన వస్తువులు, నగదు భద్రపరిచిన పెట్టె

సబ్బవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని గొల్లలపాలెం శివారు తమ్మయ్యపాలెం గ్రామంలోని ఒక ఇంటిలో వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ఇందులో నాలుగు లక్షల రూపాయల నగదు, నాలుగు తులాల బంగారం వుంది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



కాలిపోయిన రూ.500 కరెన్సీ నోట్లు

తమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన జోగ కోటేశ్వరరావు, పైడమ్మ దంపతులు, వ్యవసాయంతోపాటు గాజువాకలో కూరగాయల వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు, కోడలు కింద ఇంటిలో, కోటేశ్వరరావు, పైడమ్మ ఇంటి మేడపై రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున టీ కాచేందుకు పైడమ్మ గ్యాస్ స్టౌ వెలిగించింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో భయంతో పరుగులు తీసింది. కింద ఇంటిలో వున్న కుమారుడు, కోడలిని నిద్రలేపి గ్యాస్ లీక్ ప్రమాదం గురించి చెప్పింది. వారు మేడపైకి వెళ్లి చూడగా.. ఇంటిలో వస్తువులు కాలిపోతున్నాయి. గ్యాస్ సిలిండర్ పేలే ప్రమాదం వుండడంతో ఇంటిలోకి వెళ్లేందుకు ... మిగతా 8వ పేజీలో

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత సమాజమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పయనిస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం 3.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఎమ్మెల్యే రాక కోసం గంట పాటు విద్యార్థులు, అధికారులు ఎదురు చూశారు. అనంతరం ప్రారంభమైన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. అనకాపల్లిలో డీ హైడ్రేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. క్రీడామైదానం నుంచి భారీ ర్యాలీ ప్రారంభమై డిగ్రీ కళాశాల మీదుగా క్లబ్‌రోడ్డు జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్, దిమిలి రోడ్డు వరకు సాగింది. విద్యార్థుల నినాదాలతో పట్టణం మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, పీడీ సందీప్, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, మెప్మా సీఎంఎం పద్మ, సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐలు సావిత్రి, ఉపేంద్ర, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉషోదయా జూనియర్ కళాశాలలో..

పట్టణంలోని ఉషోదయా జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.రమేశ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. సత్యనారాయణ, ఏజీపీ దుర్గాప్రసాద్, వై.రామరాజు, కళాశాల చైర్మన్ కే బుచ్చిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీసులు, కూటమి నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధ్వర్యంలో అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉత్తమ పౌరునిగా ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం పట్టణంలో 5 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించి, స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి శచీదేవి, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, తహశీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావు, కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, ఎం.రమాకుమారి, నారపురెడ్డి పద్మ, ఎంఈఓ కేఎస్.గాంధీ, సీఐలు అప్పన్న, రామకృష్ణ, కుమారస్వామి పాల్గొన్నారు.



ఎలమంచిలిలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, తదితరులు



ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు, విద్యార్థులు

నక్కపల్లిలో..

ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సీఐ కె.కుమారస్వామి అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్ నర్సింహమూర్తి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.



అడ్డరోడ్డు జంక్షన్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని పెంటకోట జడ్పీ హైస్కూల్‌లో గురువారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పెంటకోట మెరైన్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెరైన్ పోలీసు స్టేషన్ సీఐ వై. మురళీరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్‌ఐ డి. రత్నశేఖర్, ఏఎస్‌ఐ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు కె.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి పూడిమడక మెరైన్ పోలీసులు గురువారం పూడిమడక, రాంబిల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పూడిమక మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐలు జి పైడిరాజు, బీహెచ్‌విఎస్ఎన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఎస్‌ఐ విభీషణరావు ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా శ్రీఆదర్శ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు పాల్గొన్నారు. అలాగే ఎస్.రాయవరం జడ్పీ బాలికల హైస్కూల్ విదార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల ఆస్పత్రి, తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో ఆఫీసు సిబ్బంది మాదకద్రవ్యాల నివారణపై గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కోటవురట్ల వైద్య విధానపరిషత్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసాద్, తహశీల్దార్ తిరుమలబాబు, ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు



పాయకరావుపేటలో డ్రగ్స్ రహిత ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎలమంచిలి కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.రమేశ్

స్టీల్‌ప్లాంట్‌కు భూములివ్వం

» వేంపాడు రైతులు స్పష్టీకరణ



వేంపాడులో రైతులు చేస్తున్న ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నేత అప్పలరాజు

వేంపాడులో రైతులు చేస్తున్న ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నేత అప్పలరాజు

నక్కపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ...లో ఏర్పాటుకానున్న ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు తమ భూములివ్వమని వేంపాడు గ్రామానికి చెందిన కొందరు రైతులు చెప్పారు. గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో వారంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు భూ సేకరణ చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలు, పారిశ్రామికవేత్తల లాభాల కోసం పల్లె గ్రామాలను, వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, పి.అప్పలరాజు,ఎ.పాము, డి.నూకులు, పి.నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాలు



108 కలశాలతో నగర సంకీర్తనతోపాటు సాయినాథుని పల్లకీ మోస్తున్న భక్తులు



దివ్యాలంకరణలో సాయినాథుడు

పాయకరావుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు ఆలయ ఆవరణలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉత్సవా లను నిర్వహిం చారు. ముగింపు రోజు గురువారం ఉదయం కాకాడ హారతి, పంచామృతాలు, వివిధ పండ్ల రసాలు, పుణ్య నదుల జలాలు కలిపి 108 కలశాలతో నగర సంకీర్తనతో పాటు సాయిబాబా పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సాయినాథునికి అభిషేకం నిర్వహించగా..అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 6.15 గంటలకు హారతి, సహస్ర దీపారాధన నిర్వహించారు.

నేడు మునగపాకలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం జరగనుందని గణేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు దాడి సాంబ తెలిపారు. మెయిన్‌రోడ్డును ఆనుకొని ఉన్న గణేష్ బెస్ట్ మార్కెట్ వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

'రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'



ఎలమంచిలిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు



మునగపాక: తిమ్మరాజుపేటలో విత్తనాల పంపిణీలో కూటమి నాయకులు

ఎలమంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుందని, రైతులు వరి విత్తనాలను వేసుకొని అధిక దిగుబడులు సాధించాలని టీడీపీ, జనసేన పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో రైతులకు వరి విత్తనాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారుల సూచనలు, సలహాలను అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మోహనరావు, కూటమి నేతలు ఊటకూటి రమేష్, కొరారు శ్రీను, ఆడారి ఆదిమూర్తి, గొర్లె బాబూరావు, పప్పు ఈశ్వరరావు పాల్గొన్నారు.

పుష్కలంగా ఎరువులు, విత్తనాలు

మునగపాక:ఎరువులు, విత్తనాలు లేవంటూ వైసీపీ నేతలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలో తిమ్మరాజపేట రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా ఏపీ అంతటా ప్రశాంతంగా పాలన జరుగుతోందన్నారు. అది చూసి ఓర్వలేక వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వైసీపీ తప్పుడు కార్యక్రమాలు చేస్తోందని విమర్శించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బీవీ రమణ, సూరిశెట్టి రాము, రామజోగినాయుడు, ఏఏ శ్వేత, బీవీ కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

మామిడివాడలో వరి విత్తనాలు పంపిణీ

రాంబిల్లి: మండలంలోని మామిడివాడ గ్రామంలో రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు 5 రకాల వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే 50 శాతం మేర పంపిణీ చేశామన్నారు. ఆర్‌జీఎల్ 2537, సాంబమసూరి 5294, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318, ఎంటీయూ 1121 రకాల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకుడు బద్ది మహేష్, కొత్తూరు మాజీ సర్పంచ్ నానేపల్లి సాయివరప్రసాద్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథస్వామి రథయాత్ర

మునగపాక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్రకు ఆలయాల నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో గురువారం కార్యక్రమాలు ప్రారంభించారు. మునగపాకలో కల్యాణరాట వేడుక ఘనంగా నిర్వహించారు. 27వ తేదీ ఉదయం బలరాం, సుభద్ర సమేత జగన్నాథస్వామి విగ్రహాలను ప్రత్యేక రథంలో గ్రామ పురవీధులు మీదుగా బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఇంద్రద్యుమ్న హాలు వరకు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అక్కడ కొలువుదీర్చిన దేవతామూర్తులు విగ్రహాలకు రోజుకో అవతారంలో అలంకరణ పూజలు నిర్వహిస్తామన్నారు. 27న మత్స్యావతారం, 28న కూర్మావతారం, 29న వరహావతారం, 30న నరసింహావతారం, జూలై 1న వామనావతారం, 2న పరశురామావతారం, 3న రామావతారం, 4న బలరామావతారం, 5న కృష్ణావతారం, 6న బుద్ధ, కల్కి అవతారంల్లో అలంకరిస్తామన్నారు. ఆరో తేదీన తిరుగు రథోత్సవం ఉంటుందని తెలిపారు.



జగన్నాథ, బలరాం, సుభద్ర దేవి విగ్రహాలు

పూడిమడకలో..

అచ్యుతాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడకలో జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు పులఖండం గోపాలాచార్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటలకు జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. అలాగే జూలై ఆరో తేదీ వరకు స్వామివారి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ఎలమంచిలి ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎంపిక

ఎలమంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలి నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) నూతన కమిటీ నియామకం జరిగినట్టు పట్టణ అధ్యక్షుడు పెదపూడి బండియ్య గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పట్టణంలో జిల్లా ప్రతినిధుల సమక్షంలో నూతన కమిటీ నియామకం జరిగినట్టు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పి. వెంకట్రావు మాదిగ, జిల్లా అధ్యక్షుడు ఎ. మల్లిబాబు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కనకేశ్వర మాదిగ సమక్షంలో నూతన కమిటీని నియమించినట్టు తెలిపారు. ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్‌గా దిగుమర్తి రాజుబాబు, ప్రధాన కార్యదర్శిగా గోరింట్ల చక్రవర్తి, ఉపాధ్యక్షునిగా కె.రాజబాబు, పట్టణ అధ్యక్షునిగా పెదపూడి బండియ్య మాదిగ, ఉపాధ్యక్షునిగా దిగుమర్తి కనకరాజు, సభ్యులుగా దిగుమర్తి తరుణ్, కొత్తలంక శేఖర్, దిగుమర్తి శ్రీను, డి. వెంకటేష్‌లు ఎంపికైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటరావు మాస్టారు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంపల చిన్నరాజు, పాయకరావుపేట ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని అభినందిస్తున్న నేతలు

పాయకరావుపేట తహశీల్దారుగా మహేశ్వరరావు



పాయకరావుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట తహశీల్దారుగా ఎస్‌ఏ.మహేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మునగపాక తహశీల్దారుగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన కె.ఆనంద్ రావికమతం డీటీగా బదిలీ అయ్యారు. అలాగే డిప్యూటీ తహశీల్దారుగా డి.శాంతిభూషణరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎన్‌ఏటీలో పనిచేసిన ఈయన ఇక్కడ డీటీగా నియమితులయ్యారు.

గ్రామ కంఠంలో అక్రమ నిర్మాణాలు ఆపండి..



తహశీల్దార్‌కి వినతిపత్రాన్నిస్తున్న గ్రామస్థులు

అచ్యుతాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నునపర్తి గ్రామ కంఠంలో అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రెడ్డి శ్రీను, పార్టీ శ్రేణులు కోరారు. గురువారం ఈ మేరకు ఇన్‌చార్జి తహశీల్దార్ శ్యామ్ కుమార్‌కి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్డి శ్రీను మాట్లాడుతూ సర్వే నంబరు 93లో గల రెండున్నర సెంట్ల గ్రామ కంఠాన్ని గ్రామస్థులు పూర్వం నుంచి ప్రజాప్రయోజనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారన్నారు. అయితే కొంతమంది దీనిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేయడానికి ప్రయత్నించారన్నారు. దీనిపై ప్రజాప్రయోజనాల దృష్ట్యా హైకోర్టుని (రిట్ పిటీషన్ డబ్ల్యూపి నెం. 4152 ఆఫ్ 2025) కూడా ఆశ్రయించామని తెలిపారు. మూడు రోజుల నుంచి నిర్మాణ పనులు చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహశీల్దార్‌ని కోరారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

రాంబిల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంబిల్లి, గోవిందపాలెం, ధారభోగాపురం గ్రామాల్లో 350 గొర్రెలకు, 150 మేకలకు నట్టల నివారణ మందును గురువారం వేసినట్టు రాంబిల్లి పశువైద్యాధికారి కె.రఘునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7,412 మేకలు, 7,227 గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందును వేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి మహిళలు సింధూరం,తమలపాకులతో పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠనం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

నక్కపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం శివారు పాటిమీద గ్రామంలో వున్న కొండ్రకోట నూకాలమ్మ ఆలయంలో గురువారం ఆషాఢమాసం తొలి రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్థులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి పండుగ కోసం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాష్ట్రకాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తడి,పొడి చెత్త వేరు చేయాలి : ఎంపీడీవో

నక్కపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి,పొడిచెత్త ఏరివేత సక్రమంగా సకాలంలో చేపట్టాలని ఎంపీడీవో డీ సీతారామరాజు సూచించారు. మండలంలోని గొడిచెర్ల గ్రామంలో గురువారం శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటా తడి,పొడిచెత్త ఏరివేతపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు తడి,పొడి చెత్తను సంపద కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు


ఎస్.రాయవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద గుమ్ములూరు సబ్ స్టేషన్ పరిధిలోని పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, చినగుమ్ములూరు, సైతారుపేట గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

30వ తేదీలోగా అతిథి అధ్యాపకుల నియామకం

ఎలమంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులను ఈనెల 30వ తేదీలోగా నియమిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయకుమార్ తెలిపారు. ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకులు అవసరమన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత చెంది, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఓరిజనల్ సర్టిఫికెట్స్‌తో తనను సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ కోరారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

» ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబీ



ఉమ్మలాడ అంగన్‌వాడీ కేంద్రంలో మద్యం సీసాలు

మునగపాక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు విద్యనభ్యసించే అంగన్‌వాడీ కేంద్రంలో అసాంఘిక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబీ హెచ్చరించారు. మండలంలో ఉమ్మలాడ అంగన్‌వాడీ కేంద్రం-2ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 24న గ్రామంలో జరిగిన పండుగ సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రం వెనుక తలుపులు పగలుగొట్టి లోపలకు చొరబడి మద్యం సేవించారన్నారు. మద్యం సీసాలను విడిచి వెళ్లిన విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారన్నారు. కేంద్రంలో వస్తువులు ఏమీ పోలేదని, గ్లాసులు, బాటిళ్లు పడేశారని చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు కోసం ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

▸▸ సీఐ మల్లికార్జునరావు



పరవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి లోడింగ్ చేయడం నేర మన్నారు. వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా బ్రేకులు, టైర్లు, లైటింగ్ వ్యవస్థ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. అతి వేగంతో వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అందుబాటులో వరి విత్తనాలు

పరవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 153 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారిణి ఎం.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సాంబ మసూరి 70 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం 70 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 15048 రకం ఐదు క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం ఆరు క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం రెండు క్వింటాళ్ల చొప్పున రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేశామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

పరవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్ బాబు సూచించారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు తీసుకుంటే అనారోగ్యం బారిన పడటంతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని చెప్పారు. విద్యార్థి దశ నుంచే వీటికి దూరంగా ఉండాలని, సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని ఆయన సూచించారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో శ్యామలాకుమారి, అధ్యాపకులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

పరవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వచ్చే నెల 9న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేటు గురువారం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే చర్యలు విరమించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని తొలగించడం దుర్మార్గమన్నారు. వీటి సాధనకు చేపట్టే సమ్మెలో అసంఘటితరంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.పోతు నాయుడు, గోవిందరాజు, సన్యాసిరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం డి-2 సెక్షన్ పరిధిలోని 33/11కేవీ అంతకాపల్లి సబ్ స్టేషన్ అడిషినల్ బ్రేకర్ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, మొగలిపురం, బోదివలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అద్దూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిబీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

శాకంబరిమాత అలంకరణలో వారాహి అమ్మవారు



సబ్బవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వారాహి అమ్మవారు గురువారం శాకంబరి మాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఉదయం గో పూజతో వారాహ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. అనంతరం మహా వారాహీదేవి కలశ స్థాపన జరిగింది. ఉత్సవ మూర్తికి పాలాభిషేకం, కుంకుమార్చన, యంత్ర పూజలను నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన, సాయంత్రం కామాఖ్య పీఠంలో మహా గణపతి సహిత వారాహి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

దశావతార విగ్రహాల ఏర్పాటుకు విరాళాలు

కశింకోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దశావతారాల విగ్రహాల ఏర్పాటుకు విరాళాలు సేకరిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మునగపాక బాబూరావు, సుకవాసి నారాయణరావు, బొర్ల గౌరీ చంద్రశేఖర్, అద్దూరి రామప్రసాద్, జుత్తాడ కాశి గురువారం నగదు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు ఆనాల తాతయ్యనాయుడు, కె.వెంకటసురేశ్, కె.సోమినాయుడు, గొంతిన రమణ, ఎ.మోహన్, సూరిబాబు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి

లంకెలపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికల అభివృద్ధి కృషి చేస్తానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికలో గురువారం వివిధ రకాల మొక్కలను నాటారు. జీవీఎంసీ నిధులతో శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. భవిష్యత్తులో శ్మశాన వాటికల్లో మొక్కలు పెంచి సుందరంగా తీర్చిదిద్దుతా న్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుర్రం శంకరరావు, నాయుడు, సుత్తి అప్పారావు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే కుటుంబాలు విచ్ఛిన్నం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ





అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు... సబ్బవరం ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ

సబ్బవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసైతే కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చెప్పారు. మండల కేంద్రంలో 'నషా ముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహ సదస్సులో ఆయన మాట్లాడుతూ యువతే దేశానికి వెన్నెముక అన్నారు. అటువంటి యువత బాధ్యతగా వ్యవహరిస్తూ మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రపంచంలో అన్ని రంగాల్లో వేగంగా ఎదుగుతున్న భారతదేశంలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే 'నషా ముక్త భారత్' సాధ్యం అవుతుందన్నారు. యువత బాధ్యతగా వ్యవహరిస్తూ సమాజంలోని చెడును సమర్థవంతంగా అడ్డుకోవాలని కోరారు. యోగాంధ్ర-2025లాగే ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం/రవాణాను అడ్డుకుంటామని యువతీ, యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ప్రతిభ విద్యాలయం నుంచి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ జాస్సీలక్ష్మీరాణి, సర్పంచ్ దేడ్డం ప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి అనిత, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఎస్‌వో రమామణి, తహసీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవోలు పద్మజ, రమేశ్‌నాయుడు, సీఐ రామచంద్రరావు, విద్యాలయ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందలి రమణ, గవర అప్పారావు, గజ్జి నరసింగరావు, కర్రి కనకాజు, పెద్దాడ రమణమ్మ, బంతికోళ్ల పద్మ, దుర్గాప్రసాద్ పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ నాయుడు

తుమ్మపాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ.నాయుడు పిలుపునిచ్చారు. అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో గురువారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిశ్శబ్దంగా వ్యాపిస్తున్న మహమ్మారి డ్రగ్స్ అన్నారు. ప్రధానంగా యువత డ్రగ్స్‌కు ఆకర్షితులై తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల విషయంలో జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికప్పుడు వారి ప్రవర్తనలో చోటు చేసుకుంటున్న మార్పులను గుర్తించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత చెడిపోతున్నదన్నారు. మత్తు పదార్థాలు, మద్యపానం తదితర వ్యసనాల ద్వారా క్యాన్సర్, శిరోసిస్, లివర్‌కు సంబంధించిన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం అధికారులు శేషకుమార్, లక్ష్మీనారాయణ, రామచంద్రరావు, బేగం, రమణ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

నట్టల నివారణ మందుతో మూగజీవాలకు ఆరోగ్యం

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రామ్మోహనరావు



జమాదులపాలెంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రామ్మోహనరావు

కశింకోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూగజీవులు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు తెలిపారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందు వేయడం వల్ల గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా, చురుకుగా ఉంటాయన్నారు. అలాగే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, దూడల్లో మరణాల సంఖ్య తగ్గుతుందని చెప్పారు. పొట్టేలు సగటున రెండు కిలోల బరువు పెరిగి పదిశాతం ఎక్కువ లాభాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు బి.సౌజన్య మాట్లాడుతూ ఒకే ప్రదేశంలో మేపకుండా పచ్చిక బయలు తరచుగా నాలుగైదు రోజులకు ఒకసారి మారుస్తూ ఉండాలని సూచించారు. ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు నివారణ మందులు తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్.చైతన్యమణి, నర్సింగబిల్లి పశు వైద్యాధికారిణి డాక్టర్ అల్ఫోన్సా జార్జి, కూటమి నాయకుడు మజ్జి ప్రకాశ్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గోపాలమిత్ర రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎస్పీకి ప్రజా సంఘాల వినతి

తుమ్మపాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి లంకెలపాలెం వద్ద జరుగుతున్న వరుస ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు కోరారు. ఈ మేరకు గురువారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఎస్పీ తుహిన్ సిన్హాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో లంకెలపాలెం వద్ద వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో పాటు వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గాడి బాలు, సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రకు సర్వం సిద్ధం

▸▸ విద్యుత్ దీపాలంకరణలో వేణుగోపాలస్వామి ఆలయం



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న ఆలయం

కశింకోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జగన్నాథస్వామి రథయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా కశింకోట వేణుగోపాలస్వామి ఆలయాన్ని గురువారం విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం జరగనున్న రథయాత్రను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తామని దేవస్థానం అర్చకులు రేజేటి రాంబాబు, కన్నబాబు, మారుతి, చరణ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథయాత్ర ఊరేగింపులో భాగస్వాములు కావాలని వారు కోరారు.

ఘనంగా రామకోటి లిఖిత పుస్తకాల పూజ



పూజలో పాల్గొన్న వర్తక సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ

కొత్తూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో గురువారం ఆషాడ శుద్ధ పాడ్యమి సందర్భంగా రామకోటి లిఖిత పుస్తకాల పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాత కొణతాల శివకుమార్ సహకారంతో ప్రచురించిన 350 రామకోటి పుస్తకాలను స్తూపంలో వేశారు. ఆలయ అర్చకుడు అంపోలు గోపాల్ కృష్ణశర్మ పర్యవేక్షణలో శ్రీరామనవమి రోజున భక్తులు రాసిన శ్రీరామ కోటి నామాలను సేకరించి స్తూపానికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్, సభ్యులు ఎ.మహాలక్ష్మినాయుడు, ఎం.సురేశ్, వెంకటరమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి: డీఎస్పీ



రథయాత్ర ఏర్పాట్లపై సీఐ, ఎస్‌లతో చర్చిస్తున్న డీఎస్పీ శ్రావణి

కొత్తూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రథయాత్రలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి సూచించారు. అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద రథయాత్ర ఏర్పాట్లను అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి గురువారం పరిశీలించారు. జగన్నాథస్వామి ఆలయం వద్ద శుక్రవారం రథయాత్ర ప్రారంభం నుంచి ఏయే వీధుల్లో ఊరేగింపు జరుగుతుందన్న అంశాలపై ఆలయ కార్యనిర్వాహక అధికారి మురళీ, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జిని అడిగి తెలుసుకున్నారు. ముందుగా జగన్నాథస్వామి ఉత్సవమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోలీసు అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రథయాత్ర విజయవంతంగా జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ఆలయ కమిటీ ధర్మకర్తలు ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, మహాలక్ష్మి, తులసీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో అన్నదాతకు అండగా ఉండాలి

వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల సమీక్షలో ఏవో సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సత్యనారాయణ

సబ్బవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అన్ని విధాలా అండగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. సాంబమసూరి 124 క్వింటాళ్లు, సోనామసూరి 388, ఆర్‌జీఎల్-2537 రకం 72, ఎంటియూ-1121 రకం 96, ఎంటియూ-1224 రకం 200, ఎంటియూ-1318 రకం 10 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. భూసారం పెంచుకునేందుకు వీలుగా పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వరి విత్తనాల పంపిణీ తరువాత విత్తన శుద్ధి, కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బాలరాజు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయ లక్ష్య సాధనపై పద్మావతికి ప్రశంస



పద్మావతికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న పీటీడీ ఎండీ తిరుమలరావు

తుమ్మపాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరిధిలోని ప్రజా రవాణా శాఖ వాణిజ్య ఆదాయపు లక్ష్యాన్ని చేరుకోవడంపై జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతిని ఏపీ పీటీడీ వీసీ అండ్ ఎండీ ద్వారకా తిరుమలరావు అభినందించారు. ఈ మేరకు గురువారం విజయవాడ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమెకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ ఆర్టీసీని ముందుకు తీసుకువెళ్లేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



రైతులకు రాయితీ విత్తనాలు అందజేస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర

కొత్తూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం 81వ డివిజన్ భీశెట్టి అప్పారావు కల్యాణ మండపం వద్ద గురువారం రైతులకు రాయితీపై వరి విత్తనాల పంపిణీ చేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఈ విత్తనాలను అందజేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు ఈ సందర్భంగా సురేంద్ర చెప్పారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి కృష్ణ, మాధవ, నాయుడు, ఎండపల్లి శేఖర్, నంద్యాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఈఐపీడీటీ-2కే 25 ప్రోగ్రాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్ విత్ ప్రోగ్రెసివ్ డిజైన్ థింకింగ్ అప్రోచ్ (ఈఐపీడీటీ-2కే 25) ప్రోగ్రామ్‌కు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి జూలై 5వ తేదీ వరకు కార్యక్రమం అట్టహాసంగా జరుగుతుందని చెప్పారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు డాక్టర్ వైకుంఠరావు, జి.గణేశ్, ప్రసాద్‌రెడ్డి, జీవీ శ్రీధర్, ఫణిబాబు పాల్గొన్నారు.

'రోడ్డుపై రోజుల తరబడి చెత్త ఉంచడం సరికాదు'

కొత్తూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని వుడ్‌పేట ముత్యం వారి వీధి కాలువల్లో తీసిన చెత్తను రోడ్డుపై రోజుల తరబడి ఉంచడం సరికాదని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. ముత్యం వీధి ప్రాంతంలోని కాలువల నుంచి తీసిన పూడిక తీతను రోడ్డుపై వేసి సుమారు మూడు రోజులైనా తరలించకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. రోడ్డుకిరువైపులా చెత్తతో నిండిపోవడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి దిబ్బలు మురికి గుంటలుగా మారి ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వనమాల నాగభూషణం తదితరులు ఉన్నారు.

అభ్యుదయ రైతుకు అరుదైన అవకాశం

» ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి వేదికను పంచుకున్న కరుణానిధి



ముఖ్యమంత్రి చంద్రబాబుతో పక్కన కూర్చున్న అభ్యుదయ రైతు కరుణానిధి

చింతపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన అభ్యుదయ రైతు కోరాబు కరుణానిధికి అరుదైన అవకాశం లభించింది. గురువారం గుంటూరులో ప్రభుత్వం నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయన వేదికను పంచుకున్నారు. గంజాయి నియంత్రణకు ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు విస్తృత స్థాయిలో ఈగల్ పనిచేస్తున్న విషయం తెలిసిందే. గిరిజన ప్రాంతం నుంచి అభ్యుదయ రైతుని ప్రభుత్వం ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. దీంతో ముఖ్యమంత్రితో నిర్వహించిన కార్యక్రమంలో కరుణానిధి పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందు



సారవానిపాలెంలో నట్టల నివారణ మందును వేస్తున్న పశువైద్య సిబ్బంది

అనంతగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం, చిలకలగెడ్డ పంచాయతీల పరిధిలోని సారవానిపాలెం, చిలకలగెడ్డ గ్రామాల్లో గురువారం కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు ఆధ్వర్యంలో నట్టల నివారణ మందును గొర్రెలు, మేకలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..126 గొర్రెలు, 348 మేకలకు నట్టల నివారణ మందు వేశామన్నారు. ఈనెల 26 నుంచి జూలై 10 వరకు అన్ని గ్రామాల్లో సందర్శించి ఈ వ్యాధి మందులు వేస్తామన్నారు. కార్యక్రమంలో కాశీపట్నం ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలు ప్రారంభం



సంగోడిలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పాడేరురూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం ప్రారంభం సందర్భంగా మండలంలోని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలోపార్వతీ సమేత సిద్ధి సంగమేశ్వర స్వామి ఆలయంలో వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులను గురువారంనుంచి ప్రారంభించినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిదిరోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆలయ నిర్వాహకులు బ్రహ్మకుమారీస్ విజయ, శారద, శాంతి, సుమిత్ర, అంకితల ప్రోత్సాహంతో నిర్వహించనున్నామన్నారు. చివరి రోజు అమ్మవారికి లోక కల్యాణార్థం వారాహి హోమం చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాడేరులో ట్రాఫిక్ ఇబ్బందులు



పీఎంఆర్సీ, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ రహదారిలో నిలిచిన వాహనాలు

పాడేరురూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయం వద్ద అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని కలెక్టర్, ఎస్పీ ప్రారంభించిన నేపథ్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. అయితే, పోలీసులు వాహన రాకపోకలకు వీలుగా అవసరమైన చర్యలుచేపట్టక పోవడంతో పీఎంఆర్సీ రహదారిలో,ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ రహదారిలో భారీగా వాహనాలు నిలిచి సుమారు గంట పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంది. దీనిపైవాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్య క్రమాలు జరిగేసమయంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హౌసింగ్ బిల్లులు మంజూరు: ఏఈ

హుకుంపేట జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు ఖాతా వివరాలు అందించాలని ఏఈ చిన్నబాబు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 202 మంది లబ్ధిదారులకు రూ. 1. 40 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. లింటల్ వరకు నిర్మాణంచేసిన మందికి రూ. 49 లక్షలు విడుదల చేయనున్నట్టు చెప్పారు. ఆర్సీ వరకు పూర్తి చేసిన 27 మందికి రూ. 1. 08 లక్షల చొప్పున జమచేస్తామన్నారు. ఈ స్థితిలో బ్యాంకు ఖాతాలను తమ కార్యాలయానికి అందిస్తే బిల్లులు జమ చేస్తామని ఏఈ తెలిపారు.



అరకులోయలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రామ్‌దేవ్‌బాబా, పోలీసు అధికారులు



పోస్టర్లు ఆవిష్కరణలో ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాము, అధ్యాపకులు

గంజాయి మత్తులో జీవితాలను నాశనం చేసుకోవద్దు

» యోగా గురువు రామ్‌దేవ్‌బాబా

అరకులోయ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన మన్యప్రాంతంలోని యువత ఆరోగ్యానికి హానిచేసే గంజాయి మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యోగా గురువు రామ్‌దేవ్‌బాబా పిలుపునిచ్చారు. గురువారం రాత్రి అరకులోయకు చేరుకున్న యోగా గురువు, పతంజలి ప్రొడక్ట్స్ అధినేత రామ్‌దేవ్‌బాబా టూరిజం హరితవ్యాలీ రిసార్టును సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు గంజాయి నిర్మూలనలో భాగంగా పోస్టర్‌ను రామ్‌దేవ్‌బాబాతో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ మాదకద్రవ్యాలను నియంత్రించాల్సిన అవసరముందన్నారు. అందమైన అరకులాంటి ప్రదేశాల్లో మాదకద్రవ్యాల వంటివి లేకుండా చూడాలన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి ఎంత ప్రమాదమో గుర్తించాలన్నారు. కాలుష్యరహిత వాతావరణంలో ఉన్న ఇక్కడి యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిస్సా ముక్త్ రాష్ట్రంగా మారాలి:జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాము

పాడేరురూరల్: ఆంధ్రప్రదేశ్‌ను నిస్సా ముక్త్ రాష్ట్రంగా మార్చేందుకు యువత ముందుండాలని స్థానిక జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.రాము పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్ ఆధ్వర్యంలో నిస్సా ముక్త్ భారత్ అభియాన్ క్లబ్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో పాల్గొని ఆయన మాట్లాడారు. మాదక దవ్ర్యాల వినియోగం, అక్రమ రవాణాపై చట్టపరమైన పరిణామాలను వివరించారు. ఎన్‌డీపీసీ చట్టం, శిక్షల గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. అనంతరం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రసూల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో విద్యార్థులు ప్రచారం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ గౌరీశ్వరరావు, కళాశాల ఎన్‌ఏబీఏ క్లబ్ సమన్వయ కర్త డి.గణేశ్ మాట్లాడుతూ సమాజంలో మార్పులో విద్యార్థులు ఎటువంటి పాత్ర పోషించాలో వివరించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బం ది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

చింతపల్లి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. గురువారం స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు ఆధ్వర్యంలోపోలీసులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి వద్ద మానహారం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, కొకైన్, ఎల్‌ఎస్‌డీ వంటి మత్తుపదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదన్నారు. గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు, రవాణా నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి. ఇందిరా ప్రియాంక, స్త్రీ వైద్య నిపుణులు వాసవి, ఐసీడీఎస్ సీడీపీవో రామలక్ష్మి, ఎక్సైజ్ సీఐ కూర్మారావు, హెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్, కూటమి నాయకులు రీమల ఆనందరావు, మంగు, అప్పారావు, దూరి రామకృష్ణ పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని సీత గుంట పాఠశాల-1 విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా హెచ్ఎం పండన్న ఆధ్వర్యంలో పాఠశాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులిచ్చారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో..

డే స్కాలర్ బాలికలకు ప్రత్యేక వసతి సౌకర్యం

» అరకులోయ పాఠశాలలో 100 సీట్లు కేటాయింపు



వసతి కల్పించనున్న కంఠబాంసుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

అరకులోయ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అరకులోయ కంఠబాంసుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో డేస్ స్కాలర్ విద్యార్థినులకు వసతి కల్పిస్తున్నట్టు హెచ్‌ఎం మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వశిక్ష అభియాన్ పథకం నుంచి కంఠబాంసుగుడ కేజీబీవీ-4 బాలికల వసతిగృహంగా ప్రభుత్వం గుర్తింపు నిచ్చిందన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలల్లో చదుతున్న 9 వ తరగతి, 10వ తరగతి, ఇంటర్ చదివే (బాలికలు) డే స్కాలర్స్‌కు ఈ వసతిగృహానికి అర్హులు. వీరు వసతి కోసం ఆ హైస్కూల్ హెచ్‌ఎంను సంప్రదించాలి. ఈ వసతి గృహంలో ఎస్టీ ఎస్సీ, బీసీ, ఓసీలకు చెందిన నిరుపేదలు దరఖాస్తు చేసుకుని వసతి పొందవచ్చు. 9 వ తరగతికి 25 సీట్లు, పదో తరగతి కి 25 సీట్లు, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు 25 సీట్లు చొప్పున మొత్తం 100 సీట్లు ఈ విద్యా సంవత్సరంలో మంజూరైనట్టు చెప్పారు. జూలై 1 వతేదీ నుంచి వసతిగృహం అందుబాటులోకి వస్తుందని హెచ్‌ఎం మోహనరావు తెలిపారు. దీనిని కస్తూర్బా-4 వ బాలికల వసతిగృహం నామకరణం చేసినట్టు వివరించారు.

ఆశ కార్యకర్తకు తప్పని డోలీ మోత

» పురిటినొప్పులతో ఆస్పత్రికి తరలింపు



ఆశకార్యకర్తను డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

గూడెంకొత్త వీధి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రహదారి సదుపాయంలేక ఆదివాసీలకు డోలి మోతలు తప్పడంలేదు. గురువారం పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ ఆశ కార్యకర్తను కుటుంబ సభ్యులు డోలీపై పెదవలస ఆస్పత్రికి తరలించారు. పెదవలస పంచాయతీ పోతురాజు గుమ్మలు గ్రామానికి రహదారి సదుపాయంలేదు. గత కొన్నేళ్లగా గిరిజనులు రోగులు, గర్భిణులను డోలిపైనే ఆస్పత్రికి తరలిస్తున్నారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కుస్సేకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో గ్రామానికి అంబులెన్సు వచ్చే పరిస్థితిలేక డోలీపై మూడు కిలోమీటర్లు మోసుకుని పెదవలస పీహెచ్‌సీకి తరలించారు. ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పటికైనాగ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అరకు అందాలు అమోఘం

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నళిన్ కుమార్ శ్రీవాత్సవ



జలవిహారిలో కుటుంబ సమేతంగా హైకోర్టు న్యాయ మూర్తి

డుంబ్రిగుడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకు ప్రకృతి అందాలు చాలా బాగున్నాయని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నళిన్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. అరకు అందాలను తిలకించేందుకు గురువారం కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన అకజోడ సిల్క్ ఫాం (పైనరీ) పర్యాటక కేంద్రం, చాపరాయి జలవిహారిని సందర్శించారు. ముందుగా అరకు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ కోర్టు న్యాయ మూర్తి రాము సాదరంగా స్వాగతంపలికారు. ఆయా పర్యాటక కేంద్రాల్లో చుట్టూ కొండలు, పచ్చని అందాలు అమోఘంగా ఉన్నట్టు నళినీకుమార్ కొనియాడారు. ఏఎస్ఐ పురేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది, యువత

పాడేరురూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బాకూరు ఎట్ పాడేరు బ్రాంచి ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. ఎస్‌బీఐ ప్రారంభించి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బ్యాంకు ఉద్యోగులతో పాటు యువత ఉత్సాహంగా పాల్గొని 64 యూనిట్లు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో తమర్బ విశ్వేశ్వరరావునాయుడు మాట్లాడుతూ యువత ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి ఎం.కిరణ్, డీఎండీవో చిరంజీవి, రెడ్‌క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచి వైస్‌చైర్మన్ గంగరాజు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, ఎస్‌బీఐ డిప్యూటీమేనేజర్లు ఎ.రవికిరణ్, వి.శ్రీనివాస్‌నాయుడు, పాడేరు బ్రాంచి యూనియన్ సెక్రటరీ డీఎంఎస్ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

3 నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

గూడెంకొత్తవీధి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచ్‌లకు నర్సీపట్నం మం డల పరిషత్ కార్యాలయంలో జూలై మూడు నుంచి ఐదో తేదీ వరకు శిక్షణ ఉం టుందని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టాలు, పరిపాలన, హక్కులు, బాధ్యతలపై సర్పంచ్‌లకు శిక్షణ అందించనున్నారన్నారు. మండలంలో ఉన్న ఎనిమిది మంది మహిళా సర్పంచ్‌లు ఈ శిక్షణకు విధిగా హాజరుకావాలన్నారు.

పంట రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట రుణాలకు అర్హులైన గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక వ్యవసాయ అధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 27 నుంచి జూలై రెండో తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో పంట రుణాల కోసం దరఖాస్తులను రైతుల నుంచి వ్యవసాయ సిబ్బంది తీసుకుంటారన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాల జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటిని బ్యాంకులకు అందిస్తామని ఆయన వివరించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ

చింతపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 65ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకు రేషన్ అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి నెలా 26 నుంచి 30తేదీ వరకు రేషన్ పంపిణీకి రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చింతపల్లి మండలంలో 1,407 మంది 65ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు. గురువారం సేల్స్‌మన్, డీలర్లు వారి పరిధిలోనున్న రేషన్ బియ్యం వీరి గృహాల వద్దకు తీసుకువెళ్లి అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజంగి డీఆర్ డిపో పరిధిలో వృద్ధులు, దివ్యాంగులకు సేల్స్‌మన్ శెట్టి చిన్నబ్బాయి, వీఆర్వో మానవతి రేషన్ బియ్యం అందజేశారు.

ముంచంగిపుట్టు: గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా రేషన్ సరుకులు పంపిణీ సక్రమంగా జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని టీడీపీ డివిజన్ నేత పి.పాండురంగ స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని డీఆర్ డిపోలో రేషన్ పంపిణీని ప్రారంభించారు. అనంతరం వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ బ్రాంచి మేనేజర్ పి.కుమారస్వామి, గొడౌన్ సూపరింటెండెంట్ రామ్మూర్తి, టీడీపీ నేతలు కె.సన్యాసమ్మ, ఎన్.శంకరరావు, జీసీసీ సిబ్బంది హనుమంతరావు, శంకర్, మురళి పాల్గొన్నారు.

జి.మాడుగుల: రేషన్ సరుకులను వృద్ధులు, దివ్యాంగులకు డీఆర్ డిపో నిర్వాహకుల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నట్టు స్థానిక తహశీల్దార్ జి.రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సాడేకు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ లోగా అర్హులందరికీ రేషన్ సరుకులు అందించేలా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, డీఆర్ డిపో నిర్వాహకులు పాల్గొన్నారు.



జి. మాడుగుల: రేషన్ పంపిణీలో పాల్గొన్న తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు

పాఠశాలకు డైస్‌కోడ్ లేక 'తల్లికి వందనం' దూరం

» ఎద్దుమామిడిలో 20 మందికి అందని ప్రభుత్వ చేయూత

» ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా స్పందన లేదని తల్లిదండ్రుల ఆవేదన



తల్లికి వందనం పథకానికి నోచుకోని విద్యార్థులు

కొయ్యూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతాడ పంచాయతీ ఎద్దుమామిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు, మండల స్థాయి విద్యాశాఖాధికారులు నిర్వాకంతో తల్లికి వందనం పథకం దూరమైంది. ఫలితంగా 20 మంది అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలలను సులభంగా గుర్తించేలా ఓ డైస్‌కోడ్ నంబర్ ఉంటుంది. దీని ఆధారంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలను విద్యార్థులకు వర్తింప చేస్తారు. అయితే, ఈ పాఠశాలకు డైస్ కోడ్ లేకపోవటంతో ఇందులో చదువుతున్న విద్యార్థులకు ఏ పథకం వర్తించని పరిస్థితి గత మూడేళ్లుగా నెలకొంది. డైస్ కోడ్‌ను సరిచేసే విషయంలో అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ జీపీఎస్ పాఠశాలలోని 20 మంది విద్యార్థులకు అర్హత ఉన్నా తల్లికి వందనం పథకం వర్తించలేదు. తమ విద్యార్థులందరికీ తల్లికి వందనం కోసం ప్రతిపాదనలు పంపించామని, కేవలం డైస్‌కోడ్ సరిలేకనే పథకం వర్తించలేదని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు దుచ్చరి మల్లేశ్ తెలిపాడు. ఈ సమస్య పాడేరులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదని తల్లితండ్రులు వాపోతున్నారు. స్థానిక అధికారులను సంప్రదించగా పాఠశాల డైస్‌కోడ్ నెంబరు ఓపెన్ కావడం లేదని అనడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ పిల్లలందరికీ పథకం వర్తించేలా సాంకేతిక పరమైన లోపాలను సవరించి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు



రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, దొన్నుదొర

అరకులోయ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ఎంతో మందికి ప్రాణాలను కాపాడవచ్చునని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. స్థానిక అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఎస్‌బీఐ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.అరుణ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రక్తదాన శిబిరాలు, సేవా కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, ఎమ్మెల్యే మత్స్యలింగం, ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ రాము.. ఎస్‌బీఐ అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ శిబిరంలో 42 మంది పాల్గొని రక్తదానం చేశారు. పాత్రికేయులు, సీపీఎం నాయకులు, స్థానిక యువకులతోపాటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి, కొండబాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ శ్యాంకుమార్, ఎస్‌బీఐ జోనల్ సెక్రెటరీ పైల ప్రసాద్, బ్యాంకు సిబ్బందితో పాటు గన్నెల పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది సేవలందించారు.

ఎట్టకేలకు సీలేరు పాఠశాల హెచ్‌ఎం విధులకు హాజరు

» యథావిధిగా తరగతులు.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు



విధుల్లో చేరిన సీలేరు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమారి

సీలేరు, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ఎంపీపీ పాఠశాలకు ఎట్టకేలకు గురువారంప్రధానోపాధ్యాయురాలు క్రాంతికుమారి విధులకు హాజరయ్యారు. ఇటీవల బదిలీల కౌన్సెలింగ్‌లో ఈ పాఠశాల హెచ్‌ఎంకు నక్కపల్లి వద్ద గల తీనార్ల పాఠశాలకు బది లీ అయింది. అయితే, నిబంధన ప్రకా రం కొత్తవారు వచ్చి స్థానికంగా బాధ్యతలను తీసుకున్న తరువాతే ఇక్కడి హెచ్‌ఎం రిలీవ్ అయి వెళ్లాలి.అయితే, సీలేరు పాఠశాలలో మరో ఎంటీఎస్ ఉపాధ్యా యులు ఉండటంతో ఎంఈవో ఆమె స్థానం లో ఇక్కడకు ఎవరూ రాకుండానే హెచ్‌ఎంను రిలీవ్ చేశారు. దీంతో ఈమె నక్కపల్లి వెళ్లిపోయారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయురాలు సూర్యకుమారి కూడా కౌన్సెలింగ్‌కు వెళ్లిపోవడంతో గత సోమవారం నుంచి పాఠశాలలో ఉపాధ్యాయులు లేకుండాపోయారు. ఈస్థితిలో గత మూడు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో ఉపాధ్యాయుల కోసం విద్యార్థులు నిరీక్షిస్తున్న అంశాన్ని కథనాలుగా ప్రచురించింది.ఈ నేపథ్యంలో ఎంఈవోలు బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం.క్రాంతికుమారిని కొత్తవారు చార్జి తీసుకునే వరకు ఇక్కడే కొనసాగాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె గురువారం విధులకు హాజరయ్యారు. హెచ్‌ఎం రావడంతో విద్యార్థులకుమధ్యాహ్న భోజనాలను గురువారం అమలు చేశారు. కొత్తగా వేరే ఉపాధ్యాయులు వచ్చేవరకు ఇక్కడ విధుల్లో ఉంటానని క్రాంతికుమారి తెలిపారు.

ముంచంగిపుట్టులో దొంగలు హల్‌చల్

» ఒకే రోజు రెండు షాప్‌ల్లో చోరీ.. నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రెండు షాప్‌లో దొంగలు చోరీకి పాల్పడగా, మరో దానిలో చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. గురువారం ఉదయం యజమానులు షాపులు తెరవడానికి వచ్చి చోరీ విషయం గుర్తించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని కేవీఆర్ మెడికల్ షాప్ తాళాలు పగలగొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. సొరుగులో ఉన్న సుమారు రూ. 3 వేలు అపహరించుకుపోయినట్టు యజమాని నాగరాజు తెలిపారు. బార్బర్ షాప్‌లోపలకు ప్రవేశించి ట్రిమ్మర్లు, పలు వస్తువులు, సుమారు రూ.5 వేల వరకు నగదు తీసుకుపోయినట్టు ఆ షాప్ యజయాని అప్పారావు చెప్పారు. ఆ పక్కనే ఉన్న ప్రభాకర్ కిరాణా షాప్ తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించారు. తెరచుకోకపోవడంతో మెల్లగా జారుకున్నారు. ఫిర్యాదుపై ఏఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది వచ్చి పరిశీలించారు. ఆయా షాప్‌ల యజమానులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఇదే తరహాలో గత ఆరు నెలల క్రితం వరుస దొంగతనాలు జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి చోరీలు నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.

యోగాంధ్ర విజయవంతంపై కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సంఘాల ప్రతినిధులు

పాడేరురూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 21వ తేదీన నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంలో కృషిచేసిన అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్‌ను గిరిజన ఉపాధ్యాయ సంఘ, ఉద్యోగుల సంఘాల నాయకులు గురువారం కలెక్టర్ చాంబర్‌లో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. యోగాంధ్రలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు పాల్గొని 108 సూర్య నమస్కారాలు (ఆసనాలు) పూర్తి చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ స్థితిలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను అభినందించినట్టు సంఘాల నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగం సూర్యనారాయణ, చిట్టపులి శ్రీనివాసపడాల్, సింహాచలం, రామారావు, పడాల్, ముఖి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ముసురు


నర్సీపట్నంలో వర్షం పడుతున్న దృశ్యం

నర్సీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో గురువారం ముసురు వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు తెరిపివ్వకుండా తేలికపాటి వర్షం కురిసింది. దీంతో మునిసిపాలిటీ శివారు ప్రాంతాల్లో మట్టి రోడ్లు, ఎన్టీఆర్ మినీ స్టేడియం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణ చిత్తడి చిత్తడిగా తయారయ్యాయి. ప్రజల దిన చర్యలకు ఆటంకంగా కలిగింది.

రెండో రోజుకు మునిసిపల్ కార్మికుల సమ్మె

నర్సీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ ఇంజనీరింగ్, నీటి సరఫరా, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్ కార్మికుల సమ్మె రెండో రోజుకి చేరింది. డిమాండ్ల సాధన కోసం కార్మికులు బుధవారం నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అబీద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు.

పీజీ సెట్‌లో ఎన్టీఆర్ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నర్సీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ ఫలితాలలో డాక్టర్ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారు. గణితంలో ఎన్.వినయ్‌కుమార్ 18వ ర్యాంకు, వృక్షశాస్త్రంలో ఎ.లక్ష్మీశ్రావణి 97, బి.గాయత్రి 127, వి.శ్యామల 184, రసాయణ శాస్త్రంలో కె.మధుకిరణ్ 144 ర్యాంకులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఎ.గోపాలరావు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా స్వామి

నర్సీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్‌బీఎల్.స్వామి ఎన్నికయ్యారు. ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల సందర్భంగా స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావు, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

గంజాయి రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు

ఉత్సాహంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక నివారణ దినోత్సవ ర్యాలీలు

నర్సీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని డీఎస్పీ పి.శ్రీనివాసరావు చెప్పారు. నషా ముక్త్ భారత్ అభియాన్-2025 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అబీద్ సెంటర్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజలు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. అంతకు ముందు ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు ఏర్పాటు చేసిన వేదిక మీద పట్టణ డీఎస్పీ శ్రీనివాసరావు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నదన్నారు. గంజాయికి యువత బానిసవుతున్నారని, బంగారు భవిష్యత్తును, జీవితాలను సర్వనాసనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గంజాయి రవాణా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతుండడంతో చాలా వరకు తగ్గుముఖం


ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలు


వేదికపై నుంచి ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో రమణ తదితరులు

పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఆర్డీవో వీవీ రమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, పట్టణ సీఐ గోవిందరావు. రూరల్ సీఐ రేవతమ్మ, తహసీల్దార్ రామారావు జనసేన పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురకుల కళాశాలలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ చెడువ్యసనాలకు అలవాటుపడితే అనేక ఇబ్బందులు పడతారన్నారు. వీటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎంఈవో సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్ఐ రహీం పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం గ్రామాల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై గురువారం ర్యాలీ చేపట్టారు. గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనమవుతాయని, వీటికి యువత దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. హెచ్‌ఎం కృష్ణప్రసాద్, సూపర్‌వైజర్ రాఘవ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన

▸▸ జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర

నాతవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కష్టపడే కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పి.హరినాథ్, పార్టీ మండల అధ్యక్షుడు వి.వెంకటరమణ, మండల స్థాయి నాయకలు పి.శ్రీనివాసు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎంకు గాయాలు

గొలుగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పప్పుశెట్టిపాలెం ఏఎన్ఎం రామలక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గురువారం నర్సీపట్నం నుంచి ద్విచక్ర వాహనంపై ఆమె పప్పుశెట్టిపాలెం వస్తున్నారు. చీడిగుమ్మల వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి పడిపోయారు. దీంతో గాయపడ్డ ఏఎన్ఎంను చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



వెంకటరమణ.... కన్నయ్యనాయుడు

నర్సీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డు ఆవరణంలో నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ఏఎంసీ చైర్మన్‌గా గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా చిటికల కన్నయ్యనాయుడు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొంటున్నారు.

వెదురు పెంపకానికి రైతులను గుర్తించాలి


వెదురు పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రావికమతం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెదురు పెంపకానికి 200 మంది రైతులను గుర్తించాలని బెంగళూరుకు చెందిన ఇండస్ట్రియల్ ఆఫ్ బ్యాంబుస్ సంస్థ ప్రతి నిధి కుసుమ కోరారు. సెర్ప్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు త్రిపుర రకానికి చెందిన వెదురు మొక్కలను రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ మొక్కలు నాటడానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. ఒక రైతుకు వెదురును పెంచేందుకు కనీసం 37 సెంట్లు భూమి ఉండాలన్నారు. నాటిన నాలుగేళ్ల తరువాత ఎదిగిన వెదురును తమ సంస్థ కొనుగోలు చేస్తుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఈశ్వరరావు, సీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

మాడుగుల రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపూడి అగ్రహారంలో గురువారం 50 గొర్రెలు, 450 మేకలకు నట్టల నివారణ మందును పశువైద్యులు వేశారు. ఈ కార్యక్రమాన్ని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు పరిశీలించారు. కార్యక్రమంలో కేజేపురం పశువైద్యుడు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు జూలై పదో తేదీ వరకు వేస్తామని పశువైద్యాధికారి జి.గాయత్రిదేవి తెలిపారు. గురువారం దేవరాపల్లిలో 1080 జీవాలకు ఆమె నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

మండలంలోని ఖండివరం, జేబీ.పురం, తురువోలు గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను చీడికాడ పశువైద్యాధికారులు అల్లూరి గణేష్‌రెడ్డి, కెవిఎస్.రాఘవమ్మ వేశారు. మొత్తం 180 గొర్రెలు, 520మేకలకు మందు వేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గొల్లవిల్లి రాజుబాబు, ధర్మిశెట్టి కొండబాబు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల, రోడ్డు మంజూరు చేయాలని గిరిజనుల నిరసన

దేవరాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలకు రోడ్డు, పాఠశాల మంజూరు చేయాలని సొలబొంగి గిరిజనులు మోకాళ్లపై కూర్చొని గురువారం నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ శివారు సొలబొంగి గిరిజనులు తమ పిల్లలను తీసుకొని దేవరాపల్లి సమీపంలో ఎల్.ఎం.పురం సమీపంలో శారదానది ఒడ్డుకు చేరుకున్నారు. మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వానికి తమ సమస్యల్ని వివరించారు. పిల్లల్ని బడికి పంపించాలంటే నాటు పడవలో నది దాటించాలన్నారు. వీరభద్రపేట నుంచి తమ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజనులు కోరారు.

ఆయుష్ వైద్యాధికారిణిగా పద్మావతి

చోడవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని, గవరవరం ఆయుష్ వైద్యాధికారిగా బి.పద్మావతి నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

వీరనారాయణంలో వరి విత్తనాలు పంపిణీ

మాడుగుల రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరనారాయణం గ్రామంలో గురువారం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఆర్‌జీఎల్, సోనామసూరి, సాంబమసూరి, ఎంటీయూ 1061, 1064, 1262 పలు రకాల విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్ అంబేడ్కర్ బాధ్యతల స్వీకరణ

రావికమతం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల తహశీల్దార్‌గా ఎస్‌వీ అంబేడ్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పరవాడ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా అంబేడ్కర్ మాట్లాడుతూ, రెవెన్యూ సేవలు నిర్ధేశించిన సమయంలో అందేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రైతుల సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ వెంకటరమణ మాకవరపాలెం మండలానికి బదిలీ అయ్యారు.

మాదక ద్రవ్యాల నియంత్రణతోనే మెరుగైన సమాజం

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


చోడవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, విద్యార్థులు



కె.కోటపాడు: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

చోడవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాల నియంత్రణతోనే మెరుగైన సమాజ స్థాపన ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. గురువారం స్థానిక బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుతం చిన్న పిల్లలు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిపోతుండడం ఆందోళనకరమన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తూరు జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.దేవప్రసాద్, సీఐ బి.అప్పలరాజు, ఎస్ఐలు, ఎంపీడీవో ఆంజనేయులు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జెడ్పీటీసీ మాజీసభ్యుడు మత్స్యరాజు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, మూలినాయుడు, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు నందారపు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా సభ్యులు కె. గౌరీశంకర్, జనసాహితీ సభ్యులు, పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, బిచ్చమ్మ పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు : బండారు

కె.కోటపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువకులు మత్తుకు బానిసలు కావద్దని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో కాలేజీ పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వ్యాపారం చేసే వ్యక్తులు విద్యార్థులు, యువకులను మత్తుకు బానిసలుగా తయారు చేస్తున్నారన్నారు. అనంతరం దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల, కె.కోటపాడు మండలాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలతో స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఎస్పీ మోహనరావు, వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ పీవీజీ కుమార్, టీడీపీ నాయకులు రొంగలి మహేష్, కిలపర్తి భాస్కరరావు, డోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము, దాడి ఎరుకునాయుడు, సబ్బవరపు రామునాయుడు, బండారు నరసింహనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, బొడ్డు అక్కునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలోని వడ్డాది జూనియర్ కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాలు వినియోగించమని ప్రిన్సిపాల్ జి.చిన్నారావు ప్రతిజ్ఞ చేయించారు. గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలోఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి పోరాదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలివ్వండి : డీపీవో ఆదేశం

రావికమతం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్డిప గ్రీన్‌అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలని డీపీవో సందీప్ మండల అధికారులను ఆదేశించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'వేతనాలు ఇవ్వండీ మహా ప్రభో' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. తక్షణమే గుడ్డిప గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని మండల పరిషత్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇద్దరు గ్రీన్ అంబాసిడర్లకు ఒక్కొక్కరికి ఆరు నెలల వేతన బకాయిలు రూ.36 వేలు చొప్పున రూ.72 వేలు చెల్లింపునకు అవసరమైన బిల్లును సిద్ధం చేశామని ఈవోపీఆర్డీ సీతారామస్వామి తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ

చీడికాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల రేషన్ డిపో పరిధిలో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులును గురువారం అందజేశారు. పౌరసరఫరాల శాఖ ఆర్ఐ జి.సాయిబాబు ఆధ్వర్యంలో రేషన్ డిపో డీలరు కసిరెడ్డి హేమసుందర్రావు వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేశారు.

వర్షంతో బోసిపోయిన కోనాం సంత

చీడికాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గురువారం కోనాం వారపు సంతకు కొనుగోలుదారులు లేక బోసిపోయింది. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకూ చినుకులు పడుతుండటంతో ఏజెన్సీ నుంచి వచ్చే గిరిజనులు కూడా సంతకు రాలేకపోయారు.

ఐటీ కంపెనీల దాగుడుమూతలు

సంస్థలు వచ్చేదెన్నడో, ఉద్యోగాలు ఇచ్చేదెన్నడో?

- ఇటీవల టీసీఎస్, కాగ్నిజెంట్‌కు భూముల కేటాయింపు
- గతంలోనూ అనేక కంపెనీలకు భూములు
- అనేక సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించకుండానే దశాబ్దాలుగా కాలక్షేపం
- నెరవేరని పాలకుల లక్ష్యం
- నిర్దేశిత గడువులోగా ఉపాధి కల్పనకు ఒత్తిడి తేవలసిందే


నగర నడిబొడ్డున ఉన్న విప్రో భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో ఐటీ రంగం పరిస్థితి విచిత్రంగా ఉంది. ఉద్యోగాలు కల్పిస్తాం అంటూ ముందుకువస్తున్న సంస్థలు ప్రభుత్వం నుంచి భూములు దక్కించుకున్న తరువాత అడ్రస్ ఉండడం లేదు. అలా తీసుకున్న భూముల్లో కనీసం భవనాలు కూడా నిర్మించని సంస్థలు ఎన్నో ఉన్నాయి. మరి కొన్ని సంస్థలు అందమైన భారీ భవనాలు నిర్మించి, ఆపరేషన్లు ప్రారంభించకుండా ఖాళీగా ఉంచుతున్నాయి. హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదు. గత పదిహేనేళ్లుగా విశాఖపట్నంలో ఇదే జరుగుతోంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

నగర నడిబొడ్డున విప్రో సంస్థకు 2006లో ఏడు ఎకరాలు ఇచ్చారు. అందులో నాలుగు ఎకరాల్లోనే భవనం నిర్మించారు. మరో మూడు ఎకరాలు ఖాళీగా ఉంది. ఆరు వేల మందికి ఉపాధి కల్పిస్తామని విప్రో హామీ ఇచ్చింది. భారీ భవనాన్ని ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచారు. ఆమధ్య మరో సంస్థకు అందులో కొన్ని అంతస్థులు అద్దెకు ఇవ్వగా, వారు రెండేళ్ల ఉండి ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు ఆరు అంతస్థుల భవనంలో కేవలం వంద మంది మాత్రమే ఉన్నారు. ఆ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.700 కోట్లుపైనే. ప్రభుత్వం తరఫున ఒక్కరు కూడా ఆ సంస్థను పిలిచి ఎందుకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని ప్రశ్నించడం లేదు. ఎదురుగా సత్యం కంపెనీకి భూమి ఇవ్వగా ఆ సంస్థ దివాలా తీయడంతో టెక్ మహీంద్ర టేకోవర్ చేసి నడుపుతోంది.

ఇక రుషికొండ ఐటీ పార్కులో భూములు తీసుకున్న కంపెనీల్లో కేవలం పది మాత్రమే పూర్తిస్థాయిలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. మిగిలిన సంస్థలన్నీ పేరుకు కంపెనీ నడుపుతున్నట్టు నటిస్తున్నాయి. కొన్ని అద్దెకు ఇచ్చుకున్నాయి. మరికొన్ని భవనాలు నిర్మించి కనీసం ప్రారంభోత్సవం కూడా చేయకుండా వదిలేశాయి.

నాలుగేళ్ల తరువాతా!?

ఐటీ కంపెనీలకు కూటమి ప్రభుత్వం ఎకరా భూమి 99 పైసలకే ఇస్తోంది. పేరొందిన పెద్ద సంస్థలు విశాఖపట్నం వంటి ద్వితీయ శ్రేణి నగరానికి రావాలంటే రాయితీలు ఇవ్వాల్సిందే. కాకపోతే వారితో కనీసం రెండేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించేలా చేయగలిగినప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది. అంతే తప్ప ఇప్పుడు భూములు తీసుకొని నాలుగేళ్ల తరువాత ఉద్యోగాలు ఇస్తామంటే అప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేం.

అదానీ పనులు ప్రారంభమే కాలేదు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు (2014-19) డేటా సెంటర్ కోసం అదానీ కంపెనీ భూమి తీసుకుంది. వైసీపీ ప్రభుత్వంలో దానిని రద్దు చేసి మధురవాడలో హిల్ నంబరు-4లో 130 ఎకరాలు ఒకసారి, మరోసారి 70 ఎకరాలు కేటాయించింది. అందులో రూ.22 వేల కోట్లు పెట్టుబడి పెట్టి, 25 వేల మందికి ఏడేళ్లలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీనికి 2023 మే నెలలో అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. రెండేళ్లు పూర్తయింది. వంద గజాల నిర్మాణం కూడా అక్కడ జరగలేదు. ఇక మిగిలింది ఐదేళ్లే. ఆలోగా 25 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ అదానీని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. అక్కడ ఎకరా రూ.20 కోట్లు విలువ ఉండగా, కోటి రూపాయలకు ఇచ్చారు. పెద్ద కంపెనీలు తక్కువ ధరకు భూములు తీసుకొని పనులే ప్రారంభించడం లేదు. ఆర్భాటమైన ప్రకటనలే మిగులుతున్నాయి.

టీసీఎస్ ఆపరేషన్లు ఎప్పుడు?

ఐటీ మంత్రి లోకేశ్ చేసిన అనేక ప్రయత్నాల మీదట టీసీఎస్ కంపెనీ విశాఖపట్నం రావడానికి అంగీకరించింది. రుషికొండ ఐటీ పార్కులోనే వారికి 21.6 ఎకరాలు కేటాయించారు. వెంటనే కార్యకలాపాలు ప్రారంభించడానికి అదే ఐటీ పార్కులో మిలీనియం టవర్-బిని పూర్తిగా కేటాయించారు. వారి కోసం ఆ భవనానికి ఆర్థిక మండలి నుంచి మినహాయింపు కూడా ఇచ్చారు. మూడు నెలల్లో టీసీఎస్ ప్రారంభం అవుతుందని చెప్పి ఆరు నెలలైంది. ఇప్పటికీ అక్కడ సందడి లేదు. తాజాగా కాగ్నిజెంట్ కంపెనీకి 21.8 ఎకరాలు కాపులుప్పాడలో ఇచ్చారు. ఆ సంస్థ 2029 మార్చి నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రకటించింది. అంటే దాదాపుగా నాలుగేళ్ల తరువాత అన్నమాట. ఏడాదిలోగా ఎక్కడో ఒక భవనం తీసుకొని అందులో కొంతమందితో కంపెనీని ప్రారంభించి, ఆ తరువాత సొంత భవనంలోకి మారి పూర్తిస్థాయిలో విస్తరించవచ్చు. ఆ విధంగా ప్రభుత్వం కూడా ఒప్పించాలి. 2029 ఎన్నికల సంవత్సరం. ఒకవేళ అప్పటికి ఉద్యోగాలు ఇవ్వకపోతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. దీనిపై పునరాలోచన చేయాల్సి ఉంది.

సీపెట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆహ్వానం

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మూడు సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నట్టు సీఐపీఈటీ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7893586494 సెల్ నంబరును సంప్రతించాలన్నారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాథుని రథయాత్ర భక్తుల సౌకర్యార్థం మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-పూరి-విశాఖ రైలు జూలై 6న అర్ధరాత్రి 12.45 గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు పూరీ, తిరుగు ప్రయాణంలో జూలై 7న వేకువజాము 2.15 గంటలకు పూరిలో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటలకు విశాఖ చేరుతుంది.

వసతిగృహంలో బాలికలను కరిచిన కుక్క

నాతవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవలో వున్న గిరిజన సం క్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆరుగురు బాలికలు గురువారం కుక్క కాటుకు గుర య్యారు. హాస్టల్ గేటు దగ్గర లోపల వైపున బాలికలు ఆడు కుంటుండగా సమీపంలో ఉన్న ఒక కుక్క లోపలికి వచ్చి బాలికలపై దాడి చేసింది. ఈ సందర్భంగా ఆరుగురిని కరిచింది. వసతిగృహం సిబ్బంది వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించారు. అనంతరం హాస్టల్‌కు తిరిగి తీసుకువచ్చారు. విషయం తెలిసి.. ఎస్ఐ భీమరాజు వసతిగృహానికి వెళ్లి కుక్కకాటుకు గురైన బాలికల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

విశాఖ స్టీల్‌ప్లాంటులో నేడు బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్-3ని శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభిస్తున్నారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపినప్పుడే నష్టాలను అధిగమించి లాభాలు వస్తాయని ఉక్కు మంత్రిత్వ శాఖ భావించడం, దానికి తగిన నిధులు కేంద్రం సమకూర్చడంతో గత డిసెంబరులో మూతపడిన బీఎఫ్-3ను పునఃప్రారంభించేందుకు సిద్ధం చేశారు. దీనికి అవసరమైన కూలింగ్ ప్లేట్లను చైనా నుంచి తెప్పించి ఆగమేఘాలపై బిగించారు. ఇప్పటికే ఫర్నేస్‌లో 800 టన్నుల కోల్‌ను వేశారు. శుక్రవారం దీనిని ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీ సందీప్ పాండ్రిక్ చేతులు మీదుగా చార్జింగ్ చేయిస్తారు. ఎయిర్ బ్లోయింగ్ చేసిన తరువాత ఇంకో 700 టన్నుల కోల్, సింటర్ వేస్తారు. వారం రోజులకు సిలికాతో కూడిన హాట్ మెటల్ వస్తుంది. దాని తరువాత జూలై పదో తేదీ నుంచి అసలైన హాట్ మెటల్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో నుంచి రోజుకు ఏడు వేల టన్నుల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మిగిలిన రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా ప్రస్తుతం 14 వేల టన్నులు వస్తోంది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు అవసరమైన ముడి పదార్థాలను నిరంతర సరఫరా చేస్తే రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. అలా ఆరు నెలలు చేస్తే ప్లాంటును లాభాల బాటలోకి తీసుకురావచ్చునని యాజమాన్యం చెబుతోంది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రం

- కలెక్టర్ విజయకృష్ణన్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, తదితరులు

తుమ్మపాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రమవుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో గౌరవ మర్యాదలు కలిగి ఉండేలా విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుజిత్‌సింగ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాల్సిన అవసరముందన్నారు. విద్యార్థి దశ నుంచే కొంతమంది మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ నియంత్రణకు అన్ని శాఖల అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులతో కలిసి డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడతామని ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణి, సీఐలు టీవీ విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, వెంకటనారాయణ, అల్లు స్వామినాయుడు, ఎస్ఐలు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం ప్రమాదంలో మరో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

విషమించడంతో బుధవారం రాత్రి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. అప్పలరాజుకు భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రావికమతం మండలం కొత్తకోటకు చెందిన సాలాపు రామ్‌కుమార్ (26) గురువారం మృతిచెందాడు. ఇతనితోపాటు ఇదే గ్రామానికి చెందిన తురాల శేషు నర్సీపట్నంలోని చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తున్నారు. సోమవారం రికవరీ కోసం ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా లంకెలపాలెం వద్ద ప్రమాదానికి గురయ్యారు. రామ్‌కుమార్ నడుము, కుడికాలు తీవ్రంగా దెబ్బతినగా రెండు కిడ్నీలు పనిచేయడంలేదు. దీంతో పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఇతనికి తండ్రి సముద్రం, తల్లి లలిత, భార్య బషీర వున్నారు. శేషు ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంట గ్యాస్ లీక్‌తో మంటలు

... 5వ పేజీ తరువాయి

సాహసించలేదు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం లోపలికి వెళ్లి చూడగా ఇంటిలో భద్రపరిచిన రూ.4 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం (గొలుసు, చెవి దుద్దులు)తోపాటు 20 బస్తాల ధాన్యం, 10 కోళ్లు, బస్తా బొబ్బర్లు, 120 కిలోల ఉలవలు, 30 కిలోల మినుములు, రెండు ఫ్యాన్లు, దుస్తులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు కాలిపోయాయి. మనవరాలికి (కుమార్తె కూతురు) సారె కోసం బ్యాంకు నుంచి తెచ్చి, ట్రంకు పెట్టెలో భద్రపరిచిన నగదుతోపాటు నాలుగు తులాల బంగారంం కాలిపోయిందని బాధితులు వాపోయారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. తహశీల్దార్ బి.చిన్నికృష్ణ గ్రామానికి వెళ్లి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. 25 కిలోల బియ్యం, దుప్పట్లు అందజేశారు. కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని చెప్పారు.

కొనసాగిన ముసురు

... 5వ పేజీ తరువాయి

కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం తరువాత వాతావరణం తెరిపిచ్చింది. కాగా వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్ర, శనివారాల్లో జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రైతు వికాస కేంద్రాల్లో వరి విత్తనాలు పంపిణీ చేస్తుండడంతోపాటు రెండు రోజుల నుంచి చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆకుమడులు సిద్ధం చేసుకుని విత్తనాలు చల్లుతున్నారు.

ముగిసిన ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్


డీఈవో కార్యాలయంలో ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల ఖాళీలను ఎంటీఎస్ టీచర్లతో భర్తీచేశారు. విశాఖ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నుంచి చేపట్టిన కౌన్సెలింగ్ గురువారం రాత్రి 11 గంటలతో ముగిసింది. విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో మొత్తం 426 మంది ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించారు. ఏజెన్సీలో మారుమూల ప్రాంతాల్లో పోస్టింగ్స్ వద్దని ఎంటీఎస్ టీచర్లు ఈనెల 22న ఆందోళన చేపట్టి కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. ఆ తరువాత రోజు రిలేదీక్షలు నిర్వహించారు. అయినా విద్యాశాఖాధికారులు స్పందించకపోవడంతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

బడికి వెళ్లాలంటే 10 కి.మీ.లు నడవాల్సిందే

... 5వ పేజీ తరువాయి

ఉపాధ్యాయుడుని నియమించలేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు రోజూ వై.బి.పట్నం పాఠశాలకు వెళ్లాల్సి వస్తున్నది. కలెక్టర్ స్పందించి తమ గ్రామంలో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయుడుని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా వచ్చే నెల ఒకటో తేదీలోగా గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయకపోతే పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తామని గిరిజన సంఘం నాయకులు కె.గోవిందరావు, కిల్లో నరసయ్య, కామేశ్ హెచ్చరించారు. కాగా లోసింగికి డిప్యూటేషన్‌పై ఇంతవరకు ఉపాధ్యాయుడుని నియమించకపోవడంపై ఎంఈఓ జాన్ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... సమస్య తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. ఎన్ఆర్ఎస్‌టీసీ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆగస్టులో ఆదేశాలు జారీ చేస్తుందని, అనంతరం లోసింగిలోనే పాఠశాలను నిర్వహిస్తామని చెప్పారు. అయితే పిల్లల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అప్పటి వరకు లోసింగిలోనే వలంటీర్‌ను ఏర్పాటు పాఠాలు బోధించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి - ఎలమంచిలి రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తుని రైల్వేపోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటల సమయంలో పోలీసులకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా వ్యక్తి మృతదేహం లభ్యమైందన్నారు. రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని, ఇతనికి సుమారు 45 సంవత్సరాలు వయసు ఉండొచ్చనని అంచనా వేశారు. ఆర్మీ జంగిల్ డిజైన్ కలిగిన ఫుల్‌హ్యాండ్ షర్టు, 3/4 నలుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడన్నారు. ఇతని జేబులో కచోడ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ లభించిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌కు, లేదా 9490619020 సెల్ నంబరుకు సంప్రతంచాలని ఆయన కోరారు. కాగా మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీకి తరలించామని ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎలమంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాపల్లి హైవే పక్కన కార్ల షోరూమ్ వెనుక పంట పొలంలోని గడ్డిలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గురువారం సాయంత్రం సమీపంలో పాడి పశువులు మేపుకునే వారు దుర్వాసన రావడంతో వెళ్లి పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం దుర్వాసన వస్తున్నదని, సుమారు పది రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని, అతని వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చునని చెప్పారు. మృతదేహం పక్కన రబ్బరు చెప్పులు, కళ్లజోడు, పురుగుల మందు డబ్బా ఉందన్నారు. కొక్కిరాపల్లి వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

38 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు

కొయ్యూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 38 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్టు మంప ఎస్ఐ శంకరరావు తెలిపారు. చింతపల్లి మండలం అన్నవరం నుంచి నర్సీపట్నానికి గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం సాయంత్రం ఎస్ఐ, పోలీసు సిబ్బంది చీడిపాలెం కూడలి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై రెండు మూటలతో వెళుతున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. తూకం వేయించి 38.375 కిలోలు వున్నట్టు నమోదు చేశారు. ఇతను జీకే వీధి మండలం రొంపుల గ్రామానికి గొల్లోరి బొంజిబాబుగా గుర్తించి అరెస్టు చేశారు. గంజాయితోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

రెండు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

గొలుగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రెండు కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని చిట్టింపాడు జంక్షన్ వద్ద గురువారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి చెందిన తాంబేలు యాకోబు, తాంబులు లక్ష్మిలను ఆపి తనిఖీ చేశారు. స్కూటీ డిక్కీలో రెండు కిలోల గంజాయి లభించింది. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

క్వారీ నిర్వాహకుల బరితెగింపు

- చెరువులో నుంచి మరోసారి రోడ్డు నిర్మాణం


రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో శ్రీనివాసరావు

రోలుగుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేట క్వారీ యాజమాన్యం బరితెగిస్తున్నది. రెవెన్యూ అధికారులు తొలగించిన రోడ్డును రాత్రికి రాత్రి వేసేస్తున్నారు. మండలంలోని రాజన్నపేట క్వారీ యాజమాన్యం వాహనాల రాకపోకలకు చెరువులో రోడ్డు వేసింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గత నెల 9వ తేదీన ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును తొలగించారు. మళ్లీ ఈ నెల 8వ తేదీన క్వారీ యాజమాన్యం రోడ్డు వేసింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అయితే బుధవారం ఉదయం క్వారీ యాజమాన్యం రోడ్డును పునఃనిర్మాణం చేసింది. ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో శ్రీనివాసరావు వెళ్లి పరిశీలించారు. కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.